జలమండలి జీఎం బదిలీ

మణికొండ: జలమండలి మణికొండ డివిజన్–18 జనరల్ మేనేజర్(జీఎం)గా పనిచేసిన మహేంద్రనాయక్ బదిలీ అయ్యారు. ఆయన ఎల్‌బీ నగర్ డివిజన్–11కు బదిలీకాగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి మణికొండకు బదిలీ అయ్యారు. శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయని, సోమవారం కొత్త జీఎం పదవీ బాధ్యతలు తీసుకుంటారని వారు వివరించారు.

రోజారమణికి ఎస్వీఆర్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రోజారమణి

మణికొండ: విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు జయంతిని పురస్కరించుని నార్సింగి మైహోం అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పేరుతో భక్త ప్రహ్లాద ఫేం రోజారమణికి పురస్కారాన్ని అందజేశారు. శనివారం రాత్రి మైహోం అవతార్ సెంట్రల్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఎస్వీ రంగారావు డాక్యుమెంటరీని ప్రదర్శించారు. గాయనీ, గాయకులు సురేఖమూర్తి, బాలకామేశ్వరరావులు చలన చిత్ర గీతాలాపన నిర్వహించారు. అనంతరం రోజారమణికి పురస్కారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అక్కినేని నాగేశ్వరరావు నాట కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల రావు, ప్రముఖ సినీ రచయిత డాక్టర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పుష్పాభిషేకం



మంచిరేవుల వేణుగోపాలస్వామి పుష్పాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మణికొండ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవ దేవాలయాలలో భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయాలకు చేరుకుని అర్చనలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుప్పాలగూడ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, పంచవటి కాలనీ రామాలయం, నార్సింగి శ్రీ వేంకటేశ్వరస్వామి, మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లి పంచాయతీ అనుబంధ గ్రామం కేబీ.దొడ్డి గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచు దండు ఇస్తారి అన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రాజుగౌడ్, చందు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



బండ్లగూడ: ఆషాడం బోనాలు సందర్భంగా హైదర్షాకోట్ గ్రామంలో నూతన బోనాల కమిటీని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చింతల వెంకటేష్‌ముదిరాజ్, వైస్ చైర్మన్‌లుగా కడారి రవికాంత్‌రెడ్డి, చేవెళ్ల నవీన్‌రెడ్డి, ప్రధాన కార్యాదర్శిగా పూర్ణం నర్సింగ్‌రావు, జాయింట్ సెక్రటరీగా చింతల నర్సింహ ఎన్నికయ్యారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



బాల్‌రాజ్(ఫైల్)

శంషాబాద్ రూరల్: రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని పిల్లోనిగూడ దుబ్బచర్ల బాల్‌రాజ్(45) సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఇతనికి భార్య కల్పన, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాలతో గత కొన్నేళ్ల నుంచి భార్య పిల్లలు ఇబ్రహీంపట్నంలోని తల్లిగారింటి వద్ద ఉంటుంది. బాల్‌రాజ్ గ్రామంలో తల్లి యాదమ్మతో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిన బాల్‌రాజ్ తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం గ్రామ శివారులోని జూకల్ రోడ్డు పక్కన కల్వర్టు వద్ద చెట్ల పొదల్లో చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనం..ఘనం





- భక్తిశ్రద్ధలతో కోట నాలుగో బోనం పూజ
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు
- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు

గోల్కొండ: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోల్కొండ ఎల్లమ్మకు నాల్గావ బోనం పూజ ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే గోల్కొండ కోట, పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారికి సమర్పించేందుకు అందంగా అలంకరించిన తొట్టెల ఊరేగింపులు బోనాల ఉత్సావాలకు హైలెట్‌గా నిలిచాయి. చోటాబజార్, బడా బజార్‌తో పాటు బంజారి దర్వాజా, రిసాల బజార్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఫతేదర్వాజా నుంచి మహిళా భక్తులు ప్రత్యేక దుస్తుల్లో అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. శివసత్తుల పూనకాలు, నృత్యాలు బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ జి.చంద్రమోహన్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జలమండలి వారు గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో ఉచిత తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సి.వసంత ఆధ్వర్యంలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

లంగర్‌హౌస్‌లో..

లంగర్‌హౌస్: నగరంలోని ప్రధాన ఆలయాల నుంచి తొట్టెలలు లంగర్‌హౌస్‌కి తీసుకువచ్చారు. ఇక్కడి నుంచి తొట్టెలలు, బోనాలు సామూహిక గోల్కొండ కోటకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా దారి పొడవునా వేదికలు ఏర్పాటు చేసి ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ ఊరేగింపులో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, గోల్కొండ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, నాయకులు చీకోటి ప్రవీణ్, ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్‌సింగ్ పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, దేవర శ్రీనివాస్ తదితరులు



లంగర్‌హౌస్ స్వాగత వేదికలో పాల్గొన్న రాంచందర్‌రావు



ఊరేగింపులో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ముగిసిన బాస్కెట్ బాల్ పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన ఫ్యూచర్ కిడ్స్ క్రీడాకారులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ నేతాజీ పార్క్‌లో శనివారం ప్రారంభమైన సీఐఎస్‌సీఈ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జోనల్ స్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో శనివారం బాలికల అండర్ 14, అండర్ 16, అండర్ 17 విభాగాలలో మొత్తం 14జట్లు పోటీలు పడ్డాయి. వీటిల్లో అండర్ 14, అండర్ 16, అండర్ 17 విభాగాలలో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విజేతగా నిలవగా రెండవ స్థానంలో నాసర్ బాలికల పాఠశాల, మూడవ స్థానం సుజాత స్కూల్ బాలికలు నిలిచారు. ఆదివారం జరిగిన బాలుర అండర్ 14, అండర్ 17, అండర్ 19 పోటీలలో మొత్తం 15 జట్లు పాల్గొనగా అన్ని విభాగాలలో మొదటి స్థానంలో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విజేతగా నిలువగా రెండవ స్థానంలో నాసర్, మూడవ స్థానంలో సుజాత స్కూల్‌లు నిలిచాయి.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: అట్టడుగు పేదల కోసం పార్లమెంటులో చట్టాలను అమలు చేసి వాటి ఫలాలు అందరికి అందే విధంగా బాబూ జగ్జీవన్ రామ్ కృషి చేశారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ బీజీఆర్ (ఆరాంఘర్) చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... భారత ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలను కొనియాడారు. బీజేపీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్, యూత్ అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్ పాల్గొన్నారు.



ముచ్చింతల్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో..

ఆరాంఘర్ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎ.సూర్యం, బీఆర్‌ఎస్ నాయకుడు కె.సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొహర్రం ఊరేగింపు



బీబీ కా ఆలంకు దట్టీలు సమర్పిస్తున్న నిజాం వారసులు

చార్మినార్: పదో మొహర్రం సందర్భంగా ఆదివారం పాతబస్తీలో బీబీ ఆలం సామూహిక ఊరేగింపు నిర్వహించారు. డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను లక్ష్మీ అనే ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దక్షిణ మండల డీసీపీ స్నేహ మేరా ఆధ్వర్యంలో చార్మినార్ కట్టడం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పైనుంచి ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు బీబీ కా ఆలం ఊరేగింపునకు స్వాగతం పలికారు. దారుషిఫా వద్ద చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హాపందీ తదితరులు ఊరేగింపునకు ఘనంగా స్వాగతం పలికారు. ఊరేగింపు కారణంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఇరాన్ అధ్యక్షుడి ఫొటోలు పాతబస్తీలో కలకలం రేపాయి.

దట్టీలు సమర్పిస్తున్న నిజాం వారసులు..

ఆజాఖానా జొహ్రా వద్ద బీబీ కా ఆలంకు నిజాం కుటుంబీకులు పూలు, దట్టీ సమర్పించారు. ఆజాఖానా జొహ్రా వద్ద దట్టీ సమర్పించడం ఇదే మొదటి సారి. 9వ నిజాం నవాబ్ మీర్ అజ్మత్ అలీ ఖాన్ అజ్మత్ జాహ్ బహదూర్ ఆజా ఖానా జొహ్రా వద్ద బీబీ కా ఆలంకు దట్టీ సమర్పించి నజరానా సమర్పించి కొంత దూరం వరకు బీబీ కా ఆలం ఊరేగింపు వెంట ఉన్నారు.

అమ్మవారికి తొట్టెల సమర్పణ



తొట్టెలకు పూజలు చేసిన నరేందర్‌రెడ్డి

మణికొండ: గోల్కొండ జగదాంబిక అమ్మవారికి మణికొండ క్వార్టర్స్ వాసులు ఆదివారం తొట్టెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ దేవాలయం వద్ద తొట్టెలకు పూజలు నిర్వహించి, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తీసుకుని గోల్కొండకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. తొట్టెలకు మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మెన్ కె. నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి. రవికాంత్‌రెడ్డితో పాటు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



మణికొండ: ఆషాడమాసం, తొలి ఏకాదశిని పురస్కరించుకుని మణికొండ మల్లన్న స్వామి దేవాలయం ఆవరణలో ఉన్న రేణుక ఎల్లమ్మకు కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాఖాంబరి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి గణేష్, నాయకులు యాదయ్య, బి.శ్రీరాములు, డి. బాబు, బి.ముత్యాలు, లక్ష్మయ్య, డి. కృష్ణ, బి.శంకర్ పాల్గొన్నారు.

ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు



అత్తాపూర్: వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా హైదర్‌గూడ ప్రాథమిక పశువైద్య కేంద్రంలో కుక్కలకు ఉచితంగా ఆంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ ఎం.కె.శ్రీకాంత్ మాట్లాడుతూ జూనోసిస్ వ్యాధుల నివారణకు కలిసి పని చేద్దాం అని కోరారు. కార్యక్రమంలో వీఎల్‌వో ఎం.సుధా రాణి, ఆఫీస్ సబార్డినేటర్ కె.పరమేశ్వరి, కుక్కల యజమానులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–2లో మొదటి అంతస్తు నూతన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ నాయకులు ఆదర్ల మహేశ్, బస్తీవాసులు బ్రహ్మం, నరసింహా గౌడ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



పుప్పాలగూడలో పీర్లకు పూజలు చేస్తున్న నాయకులు

మణికొండ: మొహర్రం పండగను ఆదివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట తదితర గ్రామాలలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని చెరువులు, బావుల్లో నిమజ్జనం చేశారు. పుప్పాలగూడలో జరిగిన పీర్ల ఉత్సవాలలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ టి. మల్లేష్‌ముదిరాజ్, మణికొండ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు బషీర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలకాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న వైదికులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 13 వద్ద ఉన్న శ్రీ సీతారామచంద్ర అభయాంజనేయ స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నుంచి మొదలైన ప్రత్యేక పూజలు గోవర్ధనం బట్టరాచార్యస్వామి, గోవర్ధన రాఘవాచార్య స్వామిల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవ పూజలలో బాగంగా ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, సేవా కాలం, శాత్తుమొరై. నిత్యారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ట, శాంతి పాఠం, వేద విన్నపాలు, మూల మంత్ర, మూర్తి మంత్ర హవనములు, నిత్య పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణ, నివేదన, మంగళశాసనము పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శ్రీరాంనగర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న మాజీ చైర్మన్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సమస్యలపై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మెన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. ,ఎక్కువ శాతం ఇప్పటికే పరిష్కరించామని, అక్కడక్కడ మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇటీవల ఎన్నికైన నూతన కార్యవర్గం ఆదివారం అధ్యక్షుడు కె. సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో పాల్గొన్న మాజీ చైర్మెన్ మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా ఉన్న పందెన్‌వాగు సమస్య ల పరిష్కారానికి ఇప్పటికే మున్సిపల్ అధికారులు టెండర్ పిలిచారని, త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో జునోసిస్ డే



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్



చార్మినార్‌లో..

విజయనగర్‌కాలనీ: పశుపక్షాదుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని విజయనగర్‌కాలనీ శాంతినగర్ పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జునోసిస్ డేను పురస్కరించుకొని ప్రభుత్వ పశు వైద్యశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన పెంపుడు జంతువుల యజమానులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. మాసబ్‌ట్యాంక్, విజయనగర్‌కాలనీ, ఆసిఫ్‌నగర్, కార్వాన్, మెహిదీపట్నం, మురాద్ నగర్, పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పోలీస్, మిలటరీ అధికారుల జాగిలాలకు రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ చంద్రావతి, డాక్టర్ యు.రమ్యదేవి, డాక్టర్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

చార్మినార్‌లో..

చార్మినార్: రేబిస్ వ్యాధికి చికిత్స లేనందున ముందస్తుగా వ్యాక్సినేషన్ ద్వారా దీనిని నివారించవచ్చునని జీహెచ్‌ఎంపీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రేబిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా.అశోక్ కుమార్, డా.వాసిం,డా. శ్రీకాంత్,కల్యాణ్ లతో పాటు సిబ్బంది పాల్గొని కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యానిమల్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ ఎన్‌పీపీటీఏ చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానంద్, హరికిషన్, జి.సోల్కర్ రెడ్డి, కోరని క్రాంతి పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

జియాగూడలో కరాటే స్టేట్ సెలక్షన్స్

జియాగూడ: రాయిపూర్‌లో ఆగస్టు నెల 17 నుంచి 20 వరకు జరిగే 33వ ఏఐకెఎఫ్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో తెలంగాణ నుంచి 27 మంది పలు స్కూళ్లకు చెందిన కరాటే విద్యార్థులు పాల్గొంటున్నట్లు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఏఐకెఎఫ్ సహా కోశాధికారి మల్తూంకార్ శ్రీబాలాజీ అన్నారు. ఆదివారం జియాగూడలోని భారత అభ్యుదయ శిక్షా సమితి ఏకె.భవన్‌లో 11వ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కరాటే డో చాంపియన్‌షిప్, స్టేట్ సెలెక్షన్స్ జరిగాయి. ఆల్ ఇండియా కరాటే డో ఫెడరేషన్ ఆదేశాల మేరకు కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గ్రేటర్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 27 మంది కరాటే క్రీడాకారులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌లు సాధించారు. ఈ పోటీల్లో జియాగూడకు చెందిన విద్యశ్రీ స్కూల్, సరస్వతి విద్యానికేతన్, శ్రీ శ్లోకా ది స్కూల్, రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.